సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి

తొర్రూరు: ప్రభుత్వ దవాఖానలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

- 'ప్రజావాణి' ఫిర్యాదులపై అధికారులు వెంటనే స్పందించాలి
- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

తొర్రూరు, జూలై 22: వివిధ సమస్యలపై ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను అధికారులు పరిశీలించి తక్షణమే పరిష్కారం చూపేలా చొరవ తీసుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. సోమవారం తొర్రూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్డీవో నర్సింగరావు, అధికారులతో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ఫిర్యాదులను స్వీకరించారు. తొర్రూరు పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మున్సిపల్ కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో డబుల్ బెడ్‌రూం నిర్మాణాలపై విచారణ జరిపించాలని, మండలంలోని గ్రామాల్లో పంపిణీకి సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇండ్లను లబ్ధిదారులకు అందించాలని జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్ ఫిర్యాదులు అందజేశారు. మండల కేంద్రానికి మంజూరైన వంద పడకల దవాఖాన నిర్మాణ పనులను సత్వరం ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని, డంపింగ్ యార్డు కోసం ఐదెకరాల స్థలాన్ని కేటాయించాలని మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య నేతృత్వంలో పలువురు కౌన్సిలర్లు కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ప్రజావాణిలో మొత్తం 50 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. అనంతరం శాఖల వారీగా సమీక్షిస్తూ తొర్రూరు మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు, పారిశుధ్యం, గృహనిర్మాణాల అనుమతులు, పన్నుల వసూళ్లు, పెండింగ్‌లో ఉన్న పనులపై సమీక్షించారు. తొర్రూరు ప్రభుత్వ దవాఖానను తనిఖీ చేసి జ్వరపీడితులు, సీజనల్ వ్యాధుల బారిన పడిన వారికి చికిత్స, ఓపీ పేషెంట్లకు అందున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ల్యాబ్, ఆపరేషన్ థియేటర్, ఫార్మసీ, ఇన్‌పేషెంట్స్ వార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తూ, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రానికి వచ్చిన లబ్ధిదారులతో మాట్లాడి ప్రభుత్వ పథకాల వివరాల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సిలార్ సాహెబ్, ఏడీఏ శోభన్‌బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వినతులను వెంటనే పరిష్కరించాలి

మహబూబాబాద్ రూరల్: ప్రజావాణిలో వినతులను అధికారులు వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఆయన వినతులను స్వీకరించి మాట్లాడారు. పట్టాదారు పాసుపుస్తకం, పారిశుధ్యంపై వినతులు వచ్చాయన్నారు. రెవెన్యూ శాఖ 55, గిరిజన సంక్షేమ శాఖ 11, పంచాయతీ 3, గ్రామీణాభివృద్ధి కోసం 4 ఫిర్యాదులు వచ్చినట్లు పేర్కొన్నారు. జడ్పీ సీఈవో నర్మద, డీపీవో హరిప్రసాద్, సీపీవో సుబ్బారావు, నర్సింహమూర్తి, అధికారులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

- మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్
- లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, రైతులకు కొత్త రుణాల చెక్కులు అందజేత

కేసముద్రం, జూలై 22: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ పార్టీ 6 గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేస్తుందని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో 31 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు, పీఏసీఎస్ కేసముద్రంలో రుణమాఫీ అయిన రైతులకు కొత్త రుణాలకు సంబంధించిన చెక్కులను అందించారు. అనంతరం సాధికారత మండల సమాఖ్య 19వ వార్షిక సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. రైతులకు రుణమాఫీ చేసి కొత్త రుణాలు అందించామని, సకాలంలో చెల్లిస్తే 3శాతం వడ్డీ తగ్గుతుందన్నారు. కల్యాణలక్ష్మి పథకం పేదింటి ఆడబిడ్డల కుటుంబాలకు అండగా ఉంటుందన్నారు. మహిళలు వ్యాపారవేత్తలను చేసేందుకు మహిళా శక్తి పథకం ద్వారా చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పడానికి రుణాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ దీకొండ వెంకన్న, వైస్‌చైర్మన్‌లు అల్లం నాగేశ్వరరావు, అంబటి మహేందర్‌రెడ్డి, గుగులోత్ దస్రూనాయక్, బండారు దయాకర్, బట్టు శ్రీనివాస్, భూక్యా శ్రీనివాస్‌నాయక్, ముదిగిరి సాంబయ్య, డీసీసీబీ మేనేజర్ సింధూ, యూనియన్ బ్యాంక్, ఎస్‌బీఐ మేనేజర్లు రమేశ్, శ్రీకాంత్, అడిషనల్ పీడీ జయశ్రీ, డీపీఎంలు రాజు, శ్రీనివాస్, ఏపీవో రాజవీర్ ఉన్నారు.

'డీఈవో కార్యాలయంలో అక్రమ డిప్యూటేషన్లు'

మహబూబాబాద్ రూరల్, జూలై 22: డీఈవో ఆఫీస్‌లో నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులపై కలెక్టర్ పూర్తిస్థాయి విచారణ జరపాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ సూర్యప్రకాశ్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. డీఈవో రామారావు విద్యా నిబంధనలు పాటించడం లేదని, ఉపాధ్యాయులను అక్రమ డిప్యూటేషన్లు చేస్తున్నారని, పట్టణంలో అనుమతులు లేకుండా ప్రైవేట్ పాఠశాలలు నడుపుతున్న వారికే వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. జ్యోతిబస్, సింహాద్రి, రాకేశ్, సంజయ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కనకయ్యకు వినతిపత్రం ఇస్తున్న వీవోఏలు

రైతుల సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యం

గార్ల, జూలై 22: రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తున్నదని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. సోమవారం ముల్కనూర్, రాంపురం, పోచారం చెరువుల్లో పూడికతీత పనులను ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. రైతుల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, జడ్పీటీసీ జీటోత్ ఝాన్సీలక్ష్మి, మాజీ ఎంపీపీలు నాగరాజు, వెంకట్‌లాల్, శ్రీనివాస్, నాగేశ్వరరావు, సైదయ్య, భద్రాజీ, సాయన్న, కిషన్ పాల్గొన్నారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి

ఐకేపీ, వీవోఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే కనకయ్యకు సోమవారం పీఏసీఎస్ కార్యాలయం వద్ద వినతి పత్రం అందజేశారు. వీవోఏల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, అసెంబ్లీ సమావేశంలో మాట్లాడాలని కోరారు. అదేవిధంగా సీహెచ్‌సీలో వైద్యసిబ్బందిని వెంటనే నియమించాలని సీపీఎం నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. వైద్యులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సీపీఎం నాయకులు కందునూరి శ్రీనివాస్, కందునూరి కవిత, కే బాబు, రాజారావు, అలవాల సత్యవతి పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

బయ్యారం: మండల కేంద్రంలోని సొసైటీలో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య లబ్ధిదారులకు 1.98లక్షల విలువచేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఆపదలో సీఎంఆర్‌ఎఫ్ అండగా నిలుస్తున్నాయని తెలిపారు. సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి, కాంగ్రెస్ అధ్యక్షుడు ముసలయ్య, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

హోంగార్డ్‌లను క్రమబద్ధీకరించాలని వినతి

ఎమ్మెల్యే రాంచంద్రూనాయక్‌కు వినతిపత్రం అందిస్తున్న హోంగార్డ్‌లు

మహబూబాబాద్ రూరల్, జూలై 22: జిల్లాలో హోంగార్డ్‌లను ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించాలని కోరుతూ సోమవారం పట్టణంలో ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రూ నాయక్‌కు హోంగార్డులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోలీస్‌శాఖలో హోంగార్డ్‌లు అనేక రకాల సేవలు అందిస్తున్నారని, నేటికీ వారికి ఎటువంటి ఉద్యోగ భద్రత లేదన్నారు. వెంటనే హోంగార్డ్‌లను క్రమబద్ధీకరించాలని కోరారు. కార్యక్రమంలో హోంగార్డ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు జన్ను జంపయ్య, కోశాధికారి ఎల్లాగౌడ్, కమిటీ సభ్యులు లింగచారి, మధు, శంకరయ్య పాల్గొన్నారు.

పెద్దవంగర ఎస్సైగా ఉపేందర్

పెద్దవంగర, జూలై 22: పెద్దవంగర ఎస్సైగా జీ ఉపేందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన బీ మహేశ్ ఖమ్మం జిల్లాకు వీఆర్‌కు బదిలీ కావడంతో బయ్యారం ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న ఉపేందర్ పెద్దవంగరకు వచ్చారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎలాంటి చర్యలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అధిక ఫీజులను నియంత్రించాలి

చిన్నగూడూరు(మరిపెడ), జూలై 22: అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని యూఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ సైదులుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వీరబాబు మాట్లాడుతూ..పాఠశాలల్లో టై, బెల్టులు, పుస్తకాల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ప్రణయ్, వెంకటేశ్ ఉన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

మృతి చెందిన వ్యక్తి

కేసముద్రం, జూలై 22: రైలు నుంచి జారి పడిన గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు జీఆర్‌పీ సిబ్బంది రాజు సోమవారం తెలిపారు. ఈస్ట్ కోస్టు ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు జారి కిందపడగా తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. 108 వాహనంలో మహబూబాబాద్ ఏరియా దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి 55 సంవత్సరాలు ఉంటాయని, బ్రౌన్ కలర్ షర్టు, మల్టీకల్లర్ చెక్స్ లుంగి ధరించాడని, ఏరియా దవాఖానలో మృతదేహాన్ని భద్రపరిచినట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9441557232, 8712658585 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఏపీపీగా రేవతీదేవి

తొర్రూరు, జూలై 22: తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏపీపీ)గా సోమవారం వంగ రేవతీదేవి బాధ్యలు స్వీకరించారు. 2012 అక్టోబర్‌లో ఏపీపీగా నియమించబడిన రేవతీదేవి ఇప్పటి వరకు 4వ అదనపు మేజిస్ట్రేట్ జువైనల్ జస్టిస్ బోర్డు కోర్టుకు ప్రాసిక్యూటర్‌గా పనిచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన బదిలీల్లో భాగంగా హనుమకొండ 4వ అదనపు కోర్టు నుంచి తొర్రూరు కోర్టుకు బదిలీపై వచ్చారు.

మహిళను వేధించిన కేసులో వ్యక్తికి ఏడాది జైలు

తొర్రూరు, జూలై 22: మహిళను వేధించిన కేసులో తొర్రూరుకు చెందిన కొండపల్లి వెంకన్నకు ఏడాది జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి మట్ట సరిత తీర్పు ఇచ్చినట్లు ఎస్సై జగదీశ్ తెలిపారు. 2018లో వెంకన్న ఓ మహిళను లైంగికంగా వేధించడంతో ఆమె ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై నగేశ్ కేసు నమోదు చేశారు. కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ రేవతిదేవి వాదనలు, కేసు పూర్వపరాలను పరిశీలించిన జడ్జి సరిత సోమవారం తీర్పు వెల్లడించారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ జెల్ల సతీశ్‌ను డీఎస్పీ సురేశ్, సీఐ సంజీవ్, ఎస్సై జగదీశ్ అభినందించారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా మహబూబాబాద్ జిల్లా, మహబూబాబాద్ మండలం, మహబూబాబాద్ కాపురస్తులగు శ్రీమతి మూడ ఉప్పమ్మ, భర్త: వెంకన్న, నివాసం: వెంకటేశ్వర బజార్, మహబూబాబాద్, మండలం మహబూబాబాద్, జిల్లా: మహబూబాబాద్ వీరు శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్ మహబూబాబాద్ బ్రాంచీ వారిని ఋణ సదుపాయం పొందుటకు హామీగా ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని తమ రిజిష్టర్ విక్రయ దస్తావేజు నెం. 9826/2022, తేదీ: 14-07-2022, సబ్ రిజిష్ట్రార్ వారి సమక్షములో రిజిష్టర్ కాబడిన దాని ద్వారా సంక్రమించిన ఆస్తిని హామీగా ప్రతిపాదించగా సదరు శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్ వారు తమ సమ్మతిని తెలిపియున్నారు. సదరు షెడ్యూల్ ఆస్తి విషయమై గాని సదరు ఋణ సదుపాయ విషయమైగాని ఎవరికేని ఎలాంటి అభ్యంతరములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన (5) దినములలో తగు ఆధారములతో ఈ దిగువ తెలిపిన అడ్రస్ యందు సంప్రదించగలరు. లేని యెడల ఎలాంటి అభ్యంతరములు లేవని తలచి సదరు ఋణ సదుపాయ విషయమై పై కంపెనీ వారు తదుపరి చర్యలు గైకొందురు. గడువు తర్వాత వచ్చిన అభ్యంతరములు పరిగణలోకి తీసుకోబడవు.

షెడ్యూలు ఆస్తి: మహబూబాబాద్ జిల్లా, మహబూబాబాద్ మండలం, మహబూబాబాద్ పరిధిలోని డోర్ నెం. 1-6-235/7, విస్తీర్ణం: 103.79 చ.గ.లు సమము 86.78 చ.మీ.లు గల దానికి హద్దులు: తూర్పు: మున్సిపల్ రోడ్డు, పడమర: ఇతరుల స్థలము, ఉత్తరం: గుండా శ్రీలత గృహము, దక్షిణం: మెనిగల నాగేంద్ర గృహము.

తేది: 22-07-2024,

ఇట్లు: బి. ఆనంద్ కుమార్, అడ్వకేట్, మహబూబాబాద్, 506 101, Cell: 9440241819.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

దంతాలపల్లి: సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో మురళీధర్ అన్నారు. సోమవారం దంతాలపల్లిలోని ఎస్టీ హాస్టల్‌ను ఆయన సందర్శించి పరిసరాలను పరిశీలించారు. వంటగదిని శుభ్రంగా ఉంచాలని, పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. అనంతరం ప్రభుత్వ దవాఖానలో రికార్డులను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలన్నారు.

ప్రతి విద్యార్థిపై శ్రద్ధ చూపాలి

పెద్దవంగర, జూలై 22 : ప్రతి విద్యార్థిపై శ్రద్ధ చూపాలని, నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తూ, వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం చిన్నవంగరలోని కేజీబీవీ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, తరగతి గదులు, పరిసరాలు, స్టోర్‌రూం, నీటి వసతులను పరిశీలించారు. పాఠశాలలోని వసతి, స్థితిగతులను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలన్నారు. తహసీల్దార్ మహేందర్, ఎంపీడీవో వేణుమాధవ్, ఆర్‌ఐ లష్కర్, పాఠశాల ఎస్‌వో స్రవంతి ఉన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

గార్ల, జూలై 22: గ్రామాల్లో అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, ఏ సమస్య ఉన్న వెంటనే వైద్యాధికారుల దృష్టికి తీసుకు రావాలని మెడికల్ ఆఫీసర్ రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం గార్లలోని దవాఖానలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎమ్మార్వో రవీందర్, ఎంపీవో రజిని, ఏపీఎం నరేందర్ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

చిన్నగూడూరు, జూలై 22: పదో తరగతి విద్యార్థులు ప్రణాళికా ప్రకారం చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని డీడబ్ల్యూవో ఆర్ వరలక్ష్మి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం, విద్యార్థుల నైపుణ్యాన్ని పరిశీలించి మాట్లాడారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, పోటీతత్వం అలవర్చుకొని వంతశాతం ఫలితాలు పొందాలన్నారు.

గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహించాలి

సమావేశంలో పాల్గొన్న అధికారులు

కురవి, జూలై 22: గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహించి రోగులకు మందులు అందించాలని డీఎంహెచ్‌వో కళావతీబాయి, జిల్లా ముఖ్య కార్యనిర్వాహణాధికారి నర్మద అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వీరబాబు అధ్యక్షతన సీజనల్ వ్యాధులపై నిర్వహించిన సమావేశంలో వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి గ్రామంలో డ్రైడే నిర్వహించాలని, మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని, యాంటీ లార్వా యాక్టివిటీస్ చేపట్టాలన్నారు. పైపులైన్లు లీకులు కాకుండా చూడాలని, డెంగ్యూ, మలేరియా జ్వరాలు వచ్చిన గ్రామంలో మూడురోజులకోసారి ఫాగింగ్ చేయాలన్నారు. శానిటేషన్ పనులు విస్తృతంగా చేపట్టాలన్నారు. తహసీల్దార్ సురేశ్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యురాలు విరాజిత, వైద్య సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

పంటల సాగు వివరాలు నమోదు చేయండి

సమావేశంలో మాట్లాడుతున్న డీఏవో అభిమన్యుడు

మహబూబాబాద్ రూరల్, జూలై 22: ప్రస్తుతం సాగవుతున్న పంటల వివరాలను నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి అభిమన్యుడు అన్నారు. సోమవారం పట్టణ శివారులోని ఏటిగడ్డతండా రైతు వేదికలో మానుకోట డివిజన్ వ్యవసాయ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయశాఖ అమలు చేస్తున్న పథకాలపై గ్రామంలో ఏఈవోలు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఆరుతడి పంటలైన పత్తి, మక్కజొన్న, పెసర, కంది పంటల నమోదులో కచ్చితత్వం పాటించాలన్నారు. రైతులకు రుణమాఫీ వివరాల సందేహాలపై అర్థమయ్యేలా వివరించాలన్నారు. రైతుభరోసా, కిసాన్‌ను రైతులకు అందేలా చూడాలన్నారు. కొత్తగా రైతుబీమా కోసం జూన్ 28లోపుగా పట్టాపాసు పుస్తకం పొందిన రైతులు క్లస్టర్‌వారీగా రైతుల నుంచి దరఖాస్తులు, పట్టాపాసు పుస్తకం, ఆధార్ కార్డ్‌తో ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఏవో తిరుపతిరెడ్డి, ఏఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ మోటర్ చోరీ

డోర్నకల్, జూలై 22: మండలంలోని బంజరలో ఆదివారం రాత్రి విద్యుత్ మోటర్ చోరీ జరిగినట్లు ఎస్సై సంతోష్ తెలిపారు. గ్రామానికి చెందిన రైతు చెవిటి వెంకటయ్య వ్యవసాయ బావి వద్ద ఉన్న విద్యుత్ మోటర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. దాని విలువ సుమారుగా రూ.15 వేలు ఉంటుందన్నారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థులు గణితంపై పట్టు సాధించాలి

కేసముద్రం, జూలై 22: విద్యార్థులు గణితంపై పట్టు సాధించాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఆజాద్ చంద్రశేఖర్ అన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని కల్వల ప్రభుత్వ పాఠశాలలో పై డే నిర్వహించారు. విద్యార్థులు పై ఆకారంలో కూర్చున్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సూధనపల్లి పాఠశాలలో..

కురవి: మండలంలోని సూధనపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం శిక్షా సప్తహ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ధరావత్ వెంకన్న మాట్లాడుతూ.. టీచింగ్, లర్నింగ్ మెటీరియల్ ద్వారా బోధన సులభతరం అవుతుందన్నారు. ఉపాధ్యాయులు ప్రదీప్‌కుమార్, అంజద్‌పాషా, బాలరాజు, సరోజ, శోభ, సారంగం, ప్రగతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆర్థికాభివృద్ధి సాధించాలి

నెల్లికుదురు, జూలై 22: సమాజంలో ప్రతి కుటుంబం పొదుపు చేసుకొని ఆర్థిక అభివృద్ధి సాధించాలని ప్రగతి సేవాసమితి కార్యదర్శి గద్దల జాన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ప్రగతి సేవా సమితి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సభ్యులు చెడుపాక వెంకన్న, అశోక్, రాధిక, సంధ్య, రమేశ్ పాల్గొన్నారు.

'మహిళా రక్షణ అందరి బాధ్యత'

బయ్యారం, జూలై 22: మహిళల రక్షణ అందరి బాధ్యతని మహిళా సాధికారత కేంద్ర జెండర్ స్పెషలిస్ట్ అరుణ అన్నారు. సోమవారం బయ్యారంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో ఎస్‌వో శారద ఆధ్వర్యంలో నూతన చట్టాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం నూతన చట్టాలు, షీటీం, పోక్సోపై అవగాహన కల్పించారు. షీటీం ఏఎస్సై ఆనంద్, భరోసా టీం సభ్యులు జయశ్రీ, సుప్రజ, రాకేశ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

మహబూబాబాద్ రూరల్, జూలై 22: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన పట్టణంలో సోమవారం జరిగింది. సీఐ దేవేందర్ కథనం ప్రకా రం.. కేసముద్రం మండలం పునుగొండ శివారు చెరువుకొమ్ము తండాకు చెందిన వాంకుడోత్ శంకర్(25) ఆదివారం మానుకోటకు బైక్‌పై వచ్చాడు. ఆర్టీసీ కాలనీ సమీపంలో ఎదురుగా ఆటో వచ్చి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఖమ్మం దవాఖానకు తరలించగా చికిత్స పొందు తూ సోమవారం మధ్యాహ్నం మృతి చెం దినట్లు తెలిపారు. మృతుడి తండ్రి భిక్షపతి ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్ చింతల లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇనుగుర్తిలో యువకుడు..

రామకృష్ణ (ఫైల్)

ఇనుగుర్తి: పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో జరిగింది. ఎస్సై మురళీధర్, మృతుడి తండి సంగెం యాకయ్య కథనం ప్రకారం.. యాకయ్యకు ముగ్గురు కుమారులుండగా, రెండో కుమారుడు రామకృష్ణ (21) హనుమకొండ జిల్లా కాజీపేట్‌లోని లోకోషెడ్‌లో అప్రెంటిస్‌షిప్‌లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా మానసికంగా బాధపడుతున్న రామకృష్ణ ఈనెల 17న తమ వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగాడు. స్థానికులు వెంటనే మహబూబాబాద్‌లోని ప్రభుత్వ దవాఖాకు తరలించారు. పరిస్థితి విషమించడంతో జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడని తెలిపారు. తండ్రి యాకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మురళీనాయక్ రామకృష్ణ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో వార్డు ఆఫీసర్ యాకయ్య మృతి

యాకయ్య (ఫైల్)

దంతాలపల్లి/చిన్నగూడూరు(మరిపెడ), జూలై 22: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని దాట్ల గ్రామానికి చెందిన జటంగి యాకయ్య (38)మరిపెడ మున్సిపాలిటీలో వార్డు ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున అతడి భార్య గౌతమి డీఎస్సీ పరీక్ష కోసం హైదరాబాద్‌కు వెళ్లేందుకు ఖమ్మం రైల్వేస్టేషన్‌కు బైక్‌పై తీసుకెళ్తుండగా ఖమ్మంలో బైక్‌ను కారు ఢీకొట్టడంతో యాకయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. గౌతమికి తీవ్ర గాయాలు కావడంతో దవాఖానకు తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాంచంద్రూనాయక్, మరిపెడ, దంతాలపల్లి తహసీల్దార్‌లు సైదులు, శ్రీనివాస్ యాకన్న మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

యాకన్నకు భార్య గౌతమి, ఇద్దరు కుమార్తెలు అరుషి (7), ఆద్య (4) ఉన్నారు. రోడ్డు ప్రమాదంలో గౌతమి గాయపడి దవాఖానలో చికిత్స పొందుతుండగా, బంధువులు, నానమ్మ కూతురు అరుషితో తండ్రికి తలకొరివి పెట్టించారు.

అవసరార్థులకు అండగా లయన్స్ సేవలు

తొర్రూరు, జూలై 22: అవసరార్థులకు అండగా లయన్స్ క్లబ్ సేవలు ఉండాలని జిల్లా పూర్వగవర్నర్, జిల్లా క్యాబినెట్ సలహాదారుడు కే రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం హరిపిరాల శివారు సూర్యతండాలోని జాటోత్ పాండు గుడిసె శిథిలమవడంతో లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందజేసి మాట్లాడారు. రెండ్రోజులుగా కురిసిన వర్షాలకు పాండు గుడిసె శిథిలమై, నిత్యావసర సరుకులు తడిచాయి. దీంతో లయన్స్‌క్లబ్ ఆఫ్ తొర్రూరు అధ్యక్షుడు చిదిరాల నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ఇంటిపై కప్పుకోవడానికి తాడిపత్రి, 25కిలోల బియ్యం, దోమతెర అందజేశారు. రాజేందర్‌రెడ్డి రూ.వెయ్యి ఆర్థిక సాయం అందించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా దాతలకు పాండు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సభ్యులు తమ్మెర విశ్వేశ్వరరావు, జిల్లా క్యాబినెట్ అడిషనల్ సెక్రటరీ రేగూరు వెంకన్న, క్లబ్ ప్రధాన కార్యదర్శి తమ్మి రమేశ్, కోశాధికారి బోనగిరి శంకర్, టీవీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేసముద్రం: దాశరథి చిత్రపటానికి పూలమాల వేస్తున్న యాకాంతంగౌడ్

దాశరథిని ఆదర్శంగా తీసుకోవాలి

కేసముద్రం: ప్రతి ఒక్కరూ దాశరథి కృష్ణమాచార్యులును ఆదర్శంగా తీసుకోవాలని వివేకవర్ధిని పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతంగౌడ్ అన్నారు. సోమవారం పాఠశాలలో దాశరథి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కృష్ణమాచార్యులు గొప్ప ఉద్యమకారుడు అని కొనియాడారు. ప్రిన్సిపాల్ నరేశ్, ఉపాధ్యాయులు ఇమ్మిరెడ్డి సురేందర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

గార్ల ప్రభుత్వ కళాశాలలో..

గార్ల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం దాశరథి కృష్ణమాచార్యులు జయంతి వేడుకలను అధ్యాపకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ గోవిందరావు, అధ్యాపకులు రవీందర్, సోమన్న, జోగ్య నాయక్, శ్రీనివాస్, రాంబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలను పూడ్చిన పోలీసులు

తొర్రూరు, జూలై 22: మండలంలోని నాంచారిమడూర్ –మాటేడు వరకు వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం మరమ్మతులు చేసినట్లు తొర్రూరు సీఐ సంజీవ్, ఎస్సై జగదీశ్ తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాంచారిమడూర్ –మాటేడు వరకు హైవేపై వర్షాకాలంలో గుంతలు కనబడక ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నదని, ముందస్తు చర్యల్లో భాగంగా గుంతలను కాంక్రీట్ ద్వారా పూడ్చివేసినట్లు తెలిపారు.

రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలి : కేవీపీఎస్

మహబూబాబాద్ రూరల్, జూలై 22: మున్సిపాలిటీ పరిధిలోని నెహ్రూసెంటర్ –పత్తిపాక వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను వెంటనే పూర్తి చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి అన్నారు. సోమవారం అసంపూర్తిగా ఉన్న పనుల వద్ద కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపి మాట్లాడారు. నివాస ప్రాంతాల్లో రోడ్డు పనుల కోసం గోతులు తీసి వదిలేయడం వల్ల వరద, డ్రైనేజీ నీరు చేరి చెరువుల తలపిస్తున్నాని, కాంట్రాక్టర్లు, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పనులు పూర్తి చేయాలన్నారు. వెంకన్న, లాలయ్య, శ్రీను, రాము, రమేశ్, వసంత, నర్సింహారావు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

తొర్రూరు, జూలై 22: తొర్రూరు కోర్టు ఆవరణలో నిబంధనలు ఉల్లంఘించి కోర్టు సిబ్బందిని దూషించి విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జగదీశ్ తెలిపారు. మరిపెడకు చెందిన ఇరగాని కృష్ణమూర్తి సోమవారం కోర్టు సిబ్బంతో అసభ్యకరంగా మాట్లాడడంతో పాటు విధులకు ఆటంకం కలిగించాడు. కోర్టు సూపరింటెండెంట్ కే నరసింహమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి : ఏసీడీపీవో

నెల్లికుదురు, జూలై 22: గర్భిణులు, బాలింతలు, పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చచేసుకోవాలని ఐసీడీఎస్ ఏసీడీపీవో ఇందిరా అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పప్పు, గుడ్లు ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. కేంద్రంలో నమోదైన వారికి ప్రతిరోజు అందిస్తున్న పౌష్టికాహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. సూపర్‌వైజర్లు మల్లేశ్వరి, నాగమణి ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నెల్లికుదురు, జూలై 22: సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తూ అన్నిశాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి మరియన్న అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సోమవారం అన్ని శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలి : ఎంపీడీవో

డోర్నకల్, జూలై 22: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల టాస్క్‌ఫోర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, డ్రైనేజీల్లో బ్లీచింగ్ చల్లి, పిచ్చి మొక్కలు తొలగించాలని, ఫాగింగ్ చేయాలని సూచించారు.

కరెంట్ షాక్‌తో మహిళా రైతు మృతి


లచ్చమ్మ (ఫైల్)

కురవి, జూలై 22: కరెంట్ షాక్‌తో మహిళా రైతు మృతి చెందిన ఘటన మండలంలోని నేరడలో సోమవారం జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చెల్లగొల్ల లచ్చమ్మ (50) వ్యవసాయ బావి వద్ద పొలానికి నీరు పెట్టేందుకు వెళి స్టార్టర్ ఆన్ చేసే క్రమంలో విద్యుత్ షాక్ తగిలింది. స్థానిక రైతులు, కూలీలు వెంటనే దవాఖానకు తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెం దినట్లు తెలిపారు. మృతురాలు ఐద్వా వరంగల్, మహబూబాబాద్ జిల్లా కమిటీలో విధులు నిర్వర్తించారు. లచ్చమకు భర్త మల్లయ్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.